క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ 33 కేవీఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కేపీహెచ్‌బీ 4వ ఫేజ్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆర్‌టీఓ ఆఫీస్, 4వ ఫేజ్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అల్పాహారం అందజేత

మోతీనగర్: ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజాభివృద్ధి కోసం వెచ్చించినట్లయితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారా హిల్స్ శాఖ అధ్యక్షుడు, లయన్ కేల వెంకటరావు పేర్కొన్నారు. గురువారం ఈఎస్‌ఐ ఆసుపత్రి వద్ద రోగులకు, సహాయకులకు అల్పాహారాన్ని అందజేశారు

డ్రైనేజీ పైపులైన్ల పనులను త్వరగా పూర్తి చేయాలి



చిత్తారమ్మనగర్‌లో పనులను పరిశీలిస్తున్న బాబూరావు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని చిత్తారమ్మ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పైపు లైన్ల పనులను గురువారం మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్, మల్లేష్, భాస్కర్‌రావు, సుశీల్‌కుమార్, ఐలయ్య యాదవ్ పాల్గొన్నారు.

20న బీజేపీ బహిరంగ సభ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మెట్రో హుడా ట్రక్ పార్కులో ఈనెల 20న బీజేపీలో చేరికలు సందర్భంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యారావు, వడ్డేపల్లి శరణ్‌చౌదరి, మూసాపేట కార్పొరేటర్ కె. మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

25న స్పోర్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్: క్రీడాకారులకు కావాల్సిన అన్ని వస్తువులు స్పోర్ట్స్ ఎక్స్‌పోలో ఉంటాయని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ టీజీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ బిజినెస్ సెంటర్‌లో స్పోర్ట్స్ ఎక్స్‌పో ఇండియా 2023కి సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నుండి మల్లాఖంబ్, బాక్స్ క్రికెట్, సైక్లోథాన్, బాడీ బిల్డింగ్ వరకు ఎక్స్‌పోలో కావాల్సిన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు ఉంటుందని ఉదయం 9గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రవేశం ఉచితమని తెలిపారు.

రహమాన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి అతిక్ ఉల్ రహమాన్‌కు గురువారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్సిటీ అరబిక్ విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తల్హా ఫర్హాన్ పర్యవేక్షణలో 'షేక్ అబుల్ హసన్ అలీ నద్వి రచించిన 'ది బుక్ అల్ సీరహ్ ఆన్ నబవియా' –ఒక విశ్లేషణాత్మక, వివరణాత్మక అధ్యయనం' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన



అవంతినగర్ తోటలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: మూసాపేట డివిజన్ పరిధిలోని అవంతినగర్ తోటలో రూ.11లక్షలతో చేపడుతున్న యూజీడీ పనులకు గురువారం కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐలయ్య యాదవ్, శ్యామ్ రావ్, కప్ప వెంకటరాజు, జి.వెంకటరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం ధర్మకర్తల కమిటీకి దరఖాస్తుల స్వీకరణ

బాలానగర్: ఫతేనగర్‌లోని అతి పురాతనమైన శివాలయ ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు దేవాదాయశాఖ నుంచి ప్రకటన విడుదలైనట్లు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ గురువారం తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తులను బొగ్గుల కుంటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పశువుల సంతను తరలించాలి

డిమాండ్ చేస్తున్న బబ్బుగూడ వాసులు



- ఎర్రగడ్డలో జనాభా పెరగడంతో బబ్బుగూడకు పశువుల సంత తరలింపు
- సంత అయిపోయినా పశువులను మార్కెట్‌లోనే ఉంచుతున్న వైనం
- పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని సంతను తరలించాలని వినతులు
- స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయత్నించినా పట్టించుకోని సంబంధిత అధికారులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారాల్లో నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పశువుల సంత కొనసాగుతోంది. దీంతో స్థానికులు పశువులను సంతలో ఉంచేస్తున్నారు. దీంతో పశువులు విసర్జించే మల మూత్రం పేరుకుపోవడంతో మార్కెట్ ప్రాంగణమంతా దుర్గంధంగా మారింది. దీనికి తోడు దోమలు, ఈగల బెడద పెరిగిపోయింది. దీంతో చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు.

◆ సంత వారానికి రెండు రోజులే అయినా...

సాధారణంగా వారానికి రెండు రోజుల మాత్రమే పశువుల సంత నిర్వహిస్తారు. కానీ పశువులను మాత్రం 365రోజులు ఇక్కడే ఉంచుతున్నారు. వర్షం పడితే మార్కెట్ ప్రాంగణం బురదమయంగా మారుతోంది. ఈ మార్కెట్ ఇళ్ల మధ్య ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాస వస్తోందని మార్కెట్ కమిటీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతం ఆకతాయిలకు అడ్డాగా మారిందని పేర్కొంటున్నారు.

◆ దుర్గంధంతో రోగాల బారిన పడుతున్న స్థానికులు

పశువుల సంతను గతంలో ఎర్రగడ్డలో నిర్వహించేవారు. కాలక్రమేణా అక్కడ జనసాంద్రత పెరగటంతో పాటు జాతీయ రహదారి కావటంతో సంతను బబ్బుగూడకు మార్చారు. ప్రస్తుతం ఇక్కడ పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని పశువుల సంతను



జంతు మాంస వ్యర్థాలను చెట్ల పొదల్లో పడవేసిన దృశ్యం (ఫైల్)

తరలించాలని స్థానికుల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది. సంతను దూర ప్రాంతానికి తరలించాలని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయిందని చెబుతున్నారు. బక్రీద్‌కు నిర్వహించే సంతలో జంతు కబేళా వ్యర్థాలను మార్కెట్ ప్రాంగణంలోనే పడేవేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో భరించలేని దుర్వాసన రావడంతో రోగాల బారిన పడ్డామని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువుల సంతను వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.





వర్షంతో చిత్తడిగా మారిన బబ్బుగూడలోని పశువుల సంత (ఫైల్ ఫొటోలు)

◆ వీలైనంత త్వరగా శుభ్రం చేయిస్తాం: మార్కెట్ సెక్రటరీ

ఈ విషయమై 'సాక్షి' నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ అష్ఫాఖ్ అహ్మద్ సంప్రదించగా... తాను ఇటీవలనే బాధ్యతలు చేపట్టానని ఇక్కడ వారానికి రెండు రోజులు మాత్రమే మార్కెట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సంత రోజులు కాకుండా మిగిలిన రోజుల్లో ఈ ప్రాంతంలో పశువులను ఉంచవద్దని యజమానులకు తెలియజేశామన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతం వర్షాలతో దుర్గంధంగా మారిందని వీలైనంత త్వరగా శుభ్రం చేయిస్తామని పేర్కొన్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం..



పశువులు సంత నుంచి వచ్చే దుర్గంధం, దుర్వాసన భరించలేకపోతున్నాం. సంత పేరుకు మాత్రమే రెండు రోజులు కానీ పశువులను అక్కడే ఉంచటంతో ప్రతిరోజు ఈ సమస్య ఎదురవుతోంది. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ అధికారులు సంతను వేరే ప్రాంతానికి తరలించాలి.

– ఎం.అనిత, స్థానికురాలు

ప్రజాభీష్టం మేరకే పాలన

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: సమస్యలు తెలుసుకునేందుకే ప్రజలకు వద్దకు వెళ్తున్నానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. పాదయాత్రలో భాగంగా గురువారం ఎమ్మెల్యే ఫతేనగర్ డివిజన్‌లో పర్యటించారు. నేతాజీకాలనీ, జవహర్‌నగర్, తెనుగుబస్తీ, హరిజనబస్తీ, సర్దార్ పటేల్‌నగర్, ఆల్విన్ సొసైటీ, పోస్ట్ ఆఫీస్ లైన్లలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి స్థానికులతో మాట్లాడారు. డివిజన్‌లో జరిగిన అభివృద్ధిపై స్థానికుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. డివిజన్‌లో అభివృద్ధి బాగానే ఉందని స్థానికులు ఆయనకు తెలిపారు. ప్రజాభీష్టం మేరకే పాలన కొనసాగుతోందన్నారు. పాదయాత్రలో వచ్చిన సమస్యలను వెంటనే అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారం చేస్తున్నాం అని తెలిపారు.



పాదయాత్రలో వృద్ధుడిని పలకరిస్తున్న ఎమ్మెల్యే



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటూ...

రాంనరేష్‌నగర్‌లో సమస్యలను పరిష్కరిస్తా



రాంనరేష్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్‌లో నెలకొన్న పలు సమస్యలను జలమండలి అధికారులతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంనరేష్‌నగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న పరిగణనలోకి తీసుకొని వారి విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. అదే విధంగా కాలనీవాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఎల్లవేళలా డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు నక్కా శ్రీను, వెంకటేష్‌యాదవ్, సత్యనారాయణ, రాజిరెడ్డి, శ్రీశైలం, స్వామి, సుధాకర్‌రెడ్డి, నక్క సురేష్, వెంకటయ్య, అంజిరెడ్డి, బ్రహ్మయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి

అల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని చంద్రమ్మ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.7లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై నీరు నిల్వకుండా లెవెలింగ్‌తో నిర్మాణం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలోఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, నాయకులు సమ్మారెడ్డి, కాశీనాథ్‌యాదవ్, వెంకటేష్, సాయిగౌడ్, కిరణ్, లింగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రమ్మకాలనీలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

స్టార్ ఆస్పత్రిలో 'ఇల్యూమినా' ప్రారంభం

రాయదుర్గం: అందానికి సొబగులద్దే 'ఇల్యూమినా'ను నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ మహిళా భద్రతా విభాగం డీజీ సుమతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, వాటన్నింటిని రోగులకు అందుబాటులోకి తీసుకురావడంతో హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపిచంద్ మన్నం, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గూడపాటి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో అధునాతన అవకాశాలను స్టార్ ఆస్పత్రులలో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫేస్‌లిఫ్ట్ నుంచి బ్రెస్ట్ రిడక్షన్, హ్యాండ్ సర్జరీ, బర్న్స్, ట్రామా, పోస్ట్ బెరియాట్రిక్, ట్రీట్‌మెంట్స్, సర్జరీలతోపాటు నాన్ సర్జికల్ చికిత్సలను పొందాలంటే యూరప్, అమెరికా వంటి దేశాలకు వెళ్ళాల్సి వచ్చేదని ప్రస్తుతం ఈ టెక్నాలజీని స్టార్ ఆస్పత్రిలో అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఐడబ్ల్యూఎస్ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి, ఫ్యాషన్ ఐకాన్ శిల్పారెడ్డి, విభాగాధిపతి డాక్టర్ రాజేష్ వాసు, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

భవిష్యత్తు పట్టణ ప్రణాళికలో ఎంతో కీలకం

రాయదుర్గం: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పట్టణ ప్రాంత పునర్నిర్మాణం, ప్రణాళిక మార్పునకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎంతో అవసరమని ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొఫెసర్ జోంగ్ రెన్‌పెంగ్ పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ×ఏఐ– ఎనేబుల్డ్ అర్బన్ ప్లానింగ్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఫర్ క్లైమేట్ అడాప్టేషన్¤ అనే అంశంపై ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థిరమైన అభివృద్ధి, రవాణా ప్రణాళిక, వాతావరణ మార్పుల కోసం అనుసరణ ప్రణాళిక, పట్టణ ప్రణాళికలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొఫెసర్ జోంగ్ రెన్‌పెంగ్

ఓటుపై అవగాహన.. 5కె రన్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటర్లను చైతన్యపర్చేందుకు ఈ నెల 19వ తేదీ 5కె రన్‌ను నిర్వహించనున్నట్లు శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్, నియోజకవర్గ ఈఆర్‌ఓ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు మల్కంచెరువు నుంచి 5కె రన్ గచ్చిబౌలి స్టేడియం వరకు కొనసాగుతుందన్నారు. ఈ రన్‌లో ఓటర్లు, యువకులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'డాటలింగ్' కార్యాలయం ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని సైబర్ గేట్‌వేలో యూఎస్ బేస్‌డ్ కంపెనీ డాటలింగ్ మొదటి కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. పూర్తి స్థాయిలో హెల్త్‌కేర్ టెక్నాలజీ అందిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో డాటలింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకర్ చిలకమర్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు.. ప్రత్యేక డ్రైవ్

జిన్నారం(పటాన్‌చెరు): ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు అందించనున్నామని, ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ యువజన నాయకులు ప్రవీణ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు అందించనున్నామన్నారు. ఆసక్తి గల యువకులు మరింత సమాచారం కోసం తమను సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా 'మేరుత్సవ్-2023'

పాల్గొన్న 65 పాఠశాలల విద్యార్థులు

హఫీజ్‌పేట్: మేరుత్సవ్-2023 ఇంటర్ స్కూల్ కాంపిటేషన్ ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన పోటీలలో నగరంలోని 65 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు విభాగాలలో 85 రకాల పోటీలలో 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 'జీ-20 సమ్మిట్ ఒకటే భూమి, ఒకటే కుటుంబం, ఒకటే భవిష్యత్తు' అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

గణేశ్ చవితి ఏర్పాట్లపై జెడ్‌సీ సమీక్ష

- బందోబస్తు, నిమజ్జనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం

కూకట్‌పల్లి: సెప్టెంబర్‌లో రానున్న వినాయక చవితిని పురస్కరించుకొని కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో అధికారులతో జోనల్ కమిషనర్ మమత గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వినాయక చవితిని పురస్కరించుకొని మండపాలకు అనుమతులు, విద్యుత్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినాయక నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. ప్రశాంతంగా వినాయక చవితి నిర్వహించుకునేలా నిమజ్జన బందోబస్తుపై పలు సూచనలు చేశారు.

◆ కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద తీసుకోవాల్సిన చర్యలు అధికారులకు వివరించారు. చెరువు పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జనం రోజు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, వైద్యం, బాత్‌రూంల ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి రాకపోకలు సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ అధికారులు, విద్యుత్, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌సీ మమత

మనూలో రెండ్రోజుల సదస్సు ప్రారంభం

రాయదుర్గం: రాజకీయాలు మతానికి గుడ్డిగా కట్టుబడి ఉండటాన్ని మౌలానా ఆజాద్ వ్యతిరేకించారని న్యూఢిల్లీ ఎన్‌యూఈపీఏ మాజీ మౌలానా ఆజాద్ చైర్ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్ఫాన్ హబీబ్ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ చైర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ (ఎంసీజే) సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల సమావేశం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సహ జీవనం, శాంతిని పెంపొందించే ప్రతి మతాన్ని గౌరవించాలంటూ మౌలానా చేసిన కృషిని ఆయన వివరించారు. కొలంబియా యూనివర్సిటీ ఎర్లీకెరీర్ ఫెలో డాక్టర్ షాన్నారోడ్రిగ్స్ మాట్లాడుతూ మౌలానా ఆజాద్‌ను రాజకీయ ఆలోచనాపరుడుగా అభివర్ణించారు.



ప్రొ.హబీబ్‌కు మౌలానా ఆజాద్ చిత్రపటాన్ని బహూకరిస్తున్న వీసీ ఐనుల్ హసన్

కాలనీ, బస్తీల్లో ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరిస్తా

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని బలరాంనగర్, విజ్ఞానపురి కాలనీ, మైత్రీనగర్, ఏవీబీపురం కాలనీల్లో రూ.18.30 లక్షల నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.



యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

కూకట్‌పల్లి: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వెంటనే కేటాయించాలని బీజేపీ కూకట్‌పల్లి నాయకులు గురువారం కూకట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పేదరికాన్ని, పేద ప్రజల అవసరాలను అడ్డు పెట్టుకొని మోసం చేస్తోందని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు విషయంలో బీఆర్‌యస్ కార్యకర్తలకే కేటాయించి పేదలను విస్మరిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌కి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే మొదటగా అర్హులైన పేదలందరికి ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్ రావు, నియోజకవర్గ కన్వీనర్ శ్రీకర్‌రావు, మూసాపేట కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్, కంటెస్టెడ్ కార్పొరేటర్ పిత్రం రెడ్డి, రాష్ట్ర, జిల్లా స్థాయి, వివిధ మోర్చాల నాయకులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో...

అర్హులైన నిరుపేదలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, ఫించన్లను తక్షణమే ఇవ్వాలని బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ కార్యవర్గ సభ్యుడు శరణ్ చౌదరి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వం డబ్బులు దోచుకోవడమే తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలిచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ప్రతి నిరుపేదకు ఇళ్లు కట్టించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన చూసి రాష్ట్ర ప్రజలు విసుగు చెందారని పేర్కొన్నారు. మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సూర్యారావు, నాయకులు సాధు ప్రతాప్‌రెడ్డి, ధర్మా చౌదరి, కృష్ణగౌడ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



అర్హులకు ఇళ్లు ఇవ్వాలని బాలానగర్‌లో జరిగిన నిరసన ర్యాలీలో పన్నాల హరీష్‌రెడ్డి, నాయకులు



కూకట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు